సాక్షి ప్రకాశం

సోమవారం । 25 । డిసెంబర్ । 2023

ఒంగోలుతో గాఢమైన అనుబంధం



తనకు ఒంగోలుతో గాఢమైన అనుబంధం ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత తల్లావఝుల పతంజలిశాస్త్రి తెలిపారు. 'సాక్షి'తో ఆయన ముచ్చటించారు.

- 8లో..



రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ప్రారంభం

రాష్ట్రస్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు రామాయపట్నం చర్చి గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29/21

వాతావరణం

దట్టమైన పొగ మంచు ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.



క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్న విశ్వాసులు



జేఎంబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి

క్రీస్తు మాట.. వెలుగు బాట

క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ ఒంగోలు నగరంలోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో క్యాండిల్ సర్వీస్‌ను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏసు క్రీస్తు జననం.. యావత్ మానవాళికి వరమని వక్తలు పేర్కొన్నారు. క్రీస్తు శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ఇతరులపై ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

- ఒంగోలు టౌన్

న్యూస్‌రీల్

క్రైస్తవులకు ప్రముఖుల క్రిస్మస్ శుభాకాంక్షలు

ఒంగోలు: క్రైస్తవులంతా క్రిస్మస్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు జన్మించిన రోజు జరుపుకునే క్రిస్మస్‌కు ఎంతో పవిత్రత ఉందన్నారు. ప్రేమ, సహనం, కరుణతో కూడిన విశ్వాసపూరితమైన ఏసుక్రీస్తు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని అన్నారు. శాంతి, సామరస్యం కోసం ఏసు ప్రభువును ప్రార్థించాలని కోరుతూ క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆటల పోటీలు పండుగలా జరగాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ ఈ పోటీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని మండలాల్లో ప్రారంభ ర్యాలీలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరులో ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వీవీపీలను, ఇప్పటికే ఆటల పోటీల్లో పతకాలు సాధించిన స్థానికులను ఆహ్వానించి ర్యాలీలు నిర్వహించాలని, అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. ర్యాలీ కోసం ప్రతి మండలానికి 200 నుంచి 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాను పంపుతున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తొలిరోజు వీవీపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రారంభ ప్రాంగణం వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

సంతోషాల శోభిల్లు

ఖరీదైన ప్రాంతాల్లో సకల వసతులతో పేదల ఇళ్ల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. నవరత్నాల పథకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి జగనన్న కాలనీల్లో అత్యంత నాణ్యతా ప్రమాణాలతో ప్రభుత్వం గృహాలు నిర్మిస్తోంది. ప్రతిపక్షం ఎన్ని కుట్రలు పన్నినా.. న్యాయపరమైన అడ్డంకులు సృష్టించినా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెనకడుగు వేయలేదు. జిల్లాలో 73,933 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, 52,944 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వాటిలో ఇప్పటికే 20,178 పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

- జిల్లా వ్యాప్తంగా పేద ప్రజలకు 73,993 ఇళ్లు మంజూరు
- వాటిలో 20,178 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 32,766
- ప్రభుత్వం అందించిన సాయం రూ.487.51 కోట్లు
- మౌలిక వసతుల కల్పనకు చేసిన ఖర్చు రూ.63.46 కోట్లు
- బిల్లులు పెండింగ్ లేకపోవడంపై హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



గిద్దలూరు-నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు

ఒంగోలు సిటీ:

పేదల సొంతింటి కల సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు కేటాయించారు. గృహ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. నిర్మాణాలకు ఆర్థికంగా, సామగ్రి రూపంలో లబ్ధిదారులకు చేయూతనిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 73,993 ఇళ్లను పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో ఇప్పటి వరకు 20,178 నిర్మాణాలు పూర్తయ్యాయి. బేస్‌మెంట్ నుంచి శ్లాబ్ పూర్తి వరకు వివిధ దశల్లో 32,766 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయి. ఎక్కువ శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన లే అవుట్లకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మంచినీటి పైపులైన్లు, విద్యుత్, అంతర్గత రోడ్ల నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.487.51 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. మౌలిక వసతుల కోసం మరో రూ.63.46 కోట్ల వరకు ఖర్చు చేశారు.

లబ్ధిదారులకు పంపిణీ ఇలా...

ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అవసరమైన సామగ్రి అందజేస్తోంది. 100 బస్తాల సిమెంట్, 450 కిలోల ఐరన్, 20 టన్నుల ఇసుక, ఇంటికి సరిపడా ఎలక్ట్రికల్ సామగ్రి అందిస్తోంది. ఈ మెటీరియల్‌కు అయిన మొత్తాన్ని మినహాయించి మిగిలిన సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 20,178 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, దాదాపు అందరూ గృహప్రవేశాలు పూర్తి చేసుకున్నారు.

జనవరి నెలాఖరుకు పూర్తికానున్న 13,109 ఇళ్లు...

వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి జిల్లా వ్యాప్తంగా మరో 13,109 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ లక్ష్యంగా నిర్దేశించారు. రెండో విడత గృహ మహోత్సవాలు ఫిబ్రవరిలో నిర్వహించనున్న నేపథ్యంలో 13,109 ఇళ్లకు ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాలోని 616 జగనన్న లే అవుట్లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు వేగంగా పూర్తి చేయడానికి హౌసింగ్, సంబంధిత అధికారులతో కలెక్టర్ తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, ఇసుక నిల్వలను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే లే అవుట్లకు సంబంధించి 18,278 ఇళ్లు పూర్తి చేశారు. గృహ ప్రవేశాలు జరిగాయి.

జిల్లాలో ఇళ్ల నిర్మాణాల వివరాలు ఇలా...

నియోజకవర్గం	మంజూరు చేసిన ఇళ్లు	వివిధ దశలో ఉన్న ఇళ్లు	నిర్మాణం పూర్తయిన ఇళ్లు
ఒంగోలు	15,291	2,352	2,704
సంతనూతలపాడు	6,209	2,846	3,342
దర్శి	7,622	3,362	2,379
కనిగిరి	6,867	3,523	1,805
కొండపి	6,397	3,920	2,424
గిద్దలూరు	8,344	3,883	3,743
మార్కాపురం	12,250	9,383	2,387
యర్రగొండపాలెం	6,013	3,497	1,394
మొత్తం	73,993	32,766	20,178



గిద్దలూరు మండలం ముండ్లపాడు-2 జగనన్నకాలనీలో నిర్మించిన ఇల్లు

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు, సూచనలతో జిల్లా వ్యాప్తంగా సొంత స్థలాలు, జగనన్న లే అవుట్లకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలు పూర్తయినవారు గృహ ప్రవేశాలు చేసుకుంటున్నారు. లే అవుట్లలో వచ్చే జనవరి చివరికి 13,109 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన బిల్లు జమ చేస్తున్నాం. ఇప్పటి వరకు లబ్ధిదారులకు రూ.587.51 కోట్లు అందజేశాం. మౌలిక వసతుల కల్పన కోసం 63.46 కోట్లు ఖర్చు చేశాం.

- ఈ.పేరయ్య, హౌసింగ్ పీడీ, ఒంగోలు

బాలినేని చొరవతో 230 ఎకరాల భూమి సేకరణ...

జిల్లా అంతటా కొన్ని చోట్ల లీగల్ ఇబ్బందులు ఉన్నా కూడా ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయించారు. ఒంగోలులో మాత్రం టీడీపీ వారు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకోవడంతో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా ఎలాగైనా సరే పేదలకు ఇళ్లు ఇవ్వాలనే కాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ఒప్పించారు. ఒంగోలు చుట్టుపక్కల మల్లేశ్వరపురం, ఎన్.అగ్రహారం వద్ద 209 ఎకరాల 49 సెంట్లు, వెంగముక్కలపాలెం-యరజర్ల వద్ద 220 ఎకరాల 53 సెంట్ల భూమిని సేకరించారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా బాలినేని శ్రీనివాసరెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో అందరూ పాల్గొనాలి

- ప్రభుత్వం కల్పించిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ర్యాలీని ప్రారంభించిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



ఆడుదాం ఆంధ్రా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి, నాయకులు

ఒంగోలు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని భాగస్వాములు కావాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక చెరువుకొమ్ముపాలెం వద్ద నుంచి పెళ్లూరు హైవే వరకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ర్యాలీని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డితో కలిసి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. యువతీ యువకులు ఆడుదాం ఆంధ్రా టీషర్టులు, టోపీలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటలే తమ శక్తి, ఆరోగ్యం అంటూ నినాదాలు చేస్తూ కదం తొక్కారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉత్సాహం, ఉల్లాసంతో పాటు స్థానికంగా నివాసం ఉండే వారందరి మధ్య సఖ్యత నెలకొల్పేందుకు, సుహృద్భావ వాతావరణం నెలకొల్పేందుకు ఈ ఆటలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. గ్రామీణ ప్రాంతంలోని యువతకు సైతం ప్రతిభను నిరూపించుకుని అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఇదో మంచి అవకాశమని అన్నారు. సామాన్యంగా విద్యార్థులకు మాత్రమే వర్తించే ఇటువంటి పోటీల్లో ప్రస్తుతం 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించారన్నారు. సచివాలయ స్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు నాలుగు అంచెల్లో పోటీలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో విజేతలకు ప్రత్యేకంగా అంతర్జాతీయ స్థాయి కోచ్‌లతో శిక్షణ ఇప్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ గల్లీ నుంచి మొదలవుతున్న ఈ ఆటల పోటీలు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు క్రీడాకారులకు వేదికగా మారాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. మరుగునపడిన నైపుణ్యాల వెలికితీతకు ఇదో మంచి అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా నుంచి కూడా కామన్వెల్త్, ఒలంపిక్స్‌లో పాల్గొనే అవకాశాలు అందుకోవాలని ఆకాంక్షించారు. పోటీలు ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సచివాలయం స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో యువతీ యువకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీవీలు, సెల్‌ఫోన్లు రానప్పుడు చిన్న, పెద్ద అందరూ సమష్టిగా పల్లెల్లో ఉత్సాహంగా ఆటల్లో పాల్గొనేవారని గుర్తుచేశారు. కానీ, నేడు అటువంటి పరిస్థితులు కనిపించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో శారీరక శక్తి, మానసిక సామర్థ్యాలు ప్రతిఒక్కరిలో పెంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ప్రస్తుతం సచివాలయ పరిధిలో జరిగే ప్రతి పోటీలో తాను కూడా పాల్గొంటున్నానన్నారు. ప్రతి టీముకు కిట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వమే పంపడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం మంచి విషయమన్నారు. ర్యాలీ నిర్వాహకులైన వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోన్-5 అధ్యక్షుడు మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, కార్యదర్శి పి.మణికంఠేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శి చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేలా అమర్‌నాథ్‌రెడ్డి, నవీన్ కృష్ణారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



ర్యాలీలో భారీగా పాల్గొన్న యువతీ యువకులు

జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు స్పందన రద్దు

ఒంగోలు సబర్బన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి ఒంగోలు రావద్దని సూచించారు.

ప్రజాసేవలో సింగరాయకొండ పీహెచ్‌సీకి మొదటి ర్యాంకు

సింగరాయకొండ: ప్రజలకు సేవలు అందించడంలో స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిందని సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ ధీరేంద్రర్ కుమార్ తెలిపారు. జిల్లాలో 64 పీహెచ్‌సీలు ఉండగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సాధించి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రంలో 54వ స్థానంలో నిలిచిందని వివరించారు. పీహెచ్‌సీ పరిధిలో నవంబర్ నెలలో ఏడు డెలివరీలు చేశామని, 7,852 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించామని, 703 మంది ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రిలో చికిత్స పొందారని, 4,562 రక్త పరీక్షలు చేశామని, ఇద్దరికి ఐయూసీడీ పరీక్షలు చేశామని వివరించారు. పీహెచ్‌సీకి మొదటి ర్యాంకు సాధించడంలో డాక్టర్లు జె.శ్రీధర్, చైతన్యకృష్ణ, వంశీధర్, ఉజ్వల, లీనారాఫెల్, ఆరోగ్య సిబ్బంది తమ వంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా పీహెచ్‌సీని మొదటి స్థానంలో కొనసాగాగేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా పీహెచ్‌సీలో చికిత్స చేయించుకోవాలని డాక్టర్ ధీరేంధర్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



సింగరాయకొండ ప్రభుత్వ ఆస్పత్రి భవనం

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: పెండింగ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో ఆదివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ కేసులు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసుస్టేషన్లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ కేసుల గురించి ఆరా తీశారు. పెండింగ్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి వెలుపల ఉన్న వారికి సెర్చ్ వారెంట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, తద్వారా కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. పెండింగ్ కేసులు అధికంగా ఉండకుండా చూసుకోవాలని, సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్క కేసులోనూ విచారణ పూర్తి చేయాలని చెప్పారు. నేర నియంత్రణకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వి శ్రీధరరావు, డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్, సీఐలు భక్తవత్సలరెడ్డి, జగదీష్, శ్రీనివాసరెడ్డి, యం.లక్ష్మణ్, రంగనాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవీఎఫ్ చైర్మన్ సేవానాయక్

- ఏపీ ఎన్‌జీవీఎఫ్ చైర్మన్ సేవానాయక్

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించి నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ సమస్యలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి న్యాయం చేయాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ (ఏపీఎన్‌జీవీఎఫ్) రాష్ట్ర చైర్మన్ సేవా నాయక్ కోరారు. స్థానిక డీఎల్‌డీఏ సమావేశపు మందిరంలో ఆదివారం ఉమ్మడి జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా సంఘ చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర చైర్మన్ సేవా నాయక్, జనరల్ సెక్రటరీ గోవిందరాజు, సెక్రటరీలు రామకృష్ణ, ప్రసాద్, రాఘవ, రాజమోహన్, రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో 3,200 మంది పారా వెటర్నేరియన్స్ వివిధ కేటగిరీల్లో ఏడు దశాబ్దాలుగా మూగ జీవాలకు సేవ చేస్తూ రైతులకు చేదోడువాదోడుగా పనిచేస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ పారా వెటర్నేరియన్స్ (వీఏ, ఎల్ఎస్ఏ, జేవీఓ, వీఎల్ఓ)కు అన్యాయం జరుగుతుందని చెప్పారు. పశుసంవర్ధక శాఖలో ఐఏఎస్ అధికారిని రాష్ట్ర డైరెక్టర్‌గా నియమిస్తే తమ లాంటి వారు కష్టాలు చెప్పుకుంటే విని న్యాయం చేసే అవకాశం ఉంటుందని సంఘ రాష్ట్ర నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, గోపి, కృష్ణాంజనేయులు, ఖాదర్ బాషా, జిల్లా ఫెడరేషన్ సభ్యులు కోటేశ్వరరావు, రవికుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



మగ బిడ్డతో 108 సిబ్బంది

కొనకనమిట్ల: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108లో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవమైంది. మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన పి.వెంకటమ్మకి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు రావటంతో 108కి సమాచారం అందించారు. పొదిలి 108 వాహనంలో వెంకటమ్మను తీసుకెళుతుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావటంతో వాహనాన్ని ఆపి మహిళకు ప్రసవం చేశారు. వెంకటమ్మ మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ పి.శ్రావణి, పైలట్ శ్రీనివాస్, ఓఈ ఎం.రాజేంద్రప్రసాద్, మేనేజర్ విజయకుమార్ తెలిపారు.

ఒంగోలుతో గాఢమైన అనుబంధం

● 'సాక్షి'తో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత తల్లావఝుల పతంజలి శాస్త్రి



ఒంగోలు టౌన్: పతంజలి శాస్త్రి.. సాహిత్య రంగంలో విశేష ప్రతిభ సొంతం చేసుకున్న రచయిత. ఆయన కథలు, రచనలు నిజ జీవిత పాత్రలతో ఇట్టే కడిపడేస్తాయి. వాటిలో పాత్రదారులు మనతో మాట్లాడతారు.. కరచాలనం చేస్తారు.. గుండెలకు హత్తుకుంటారు!!. పతంజలి శాస్త్రి కలం నుంచి జాలువారిన 'రామేశ్వరంలో కాకులు.. మరికొన్ని కథలు' లఘు కథా సంపుటికి ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ–2023 అవార్డు లభించింది. బాల్యమంతా ఒంగోలులో గడిపిన శాస్త్రి.. తన చిన్ననాటి సంగతులు, రచనా ప్రస్థానం గురించి 'సాక్షి'తో ఆత్మీయంగా ముచ్చటించారు.

రంగరాయ చెరువు గట్టుపై ఆడుకునేవాన్ని..

'నా బాల్యమంతా ఒంగోలులోనే గడిచింది. స్నేహితులతో కలిసి రంగరాయ చెరువు గట్టు మీద ఆడుకునేవాడిని. ఇప్పటికీ ఒంగోలు పేరు తలుచుకుంటే చిన్ననాటి జ్ఞాపకాలు మదిలో మెదులుతాయి. ఒంగోలుతో నాది గాఢమైన అనుబంధం. పీపీఆర్ మున్సిపల్ స్కూలు, సీఎస్ఆర్ శర్మ కాలేజీలో విద్యాభ్యాసం సాగింది. మా తండ్రి తల్లావఝుల కృత్తివాస తీర్థులు, సోదరుడు విద్యాపతి ఒంగోలులోని శర్మ కాలేజీలో ఉద్యోగం చేశారు. ఆ తరువాత విద్య, ఉద్యోగరీత్యా ఒంగోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లి అక్కడే స్థిరపడ్డాం'

బంధువులు లేరు కానీ అదే అనుబంధం

'ప్రస్తుతం ఒంగోలులో బంధువులు లేరు, ఇల్లు లేదు, మిత్రులు కూడా లేరు. అయినప్పటికీ ఒంగోలు పేరు వింటే చాలు మనసంతా ఒకరకమైన అనుభూతి కలుగుతుంది. సాహిత్య ప్రపంచంలో ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించిన మా తాత శివశంకర శాస్త్రి, తండ్రి కృతివాస తీర్థులు నుంచి వారసత్వంగా సాహిత్య రచన అబ్బింది. ఏదైనా కథ రాసిన తర్వాత ప్రచురణ నిమిత్తం వెంటనే పంపించను. నా రచనల్లో అన్నీ ఇష్టమైనవే'

అవార్డుల కోసం కథలు రాయను

రామేశ్వరం కాకులు కథకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం సంతోషంగా ఉంది. అయితే అవార్డులు, పురస్కారాల కోసం రచనలు చేయడం నాకు ఇష్టముండదు. మనసులో నుంచి ఒక ఫీల్ వచ్చినప్పుడే నేను కథ రాస్తా, అందుకే నేను రాసిన కథల సంఖ్య చాలా తక్కువ'.

సాహిత్యకారుల అభినందనలు

ఒంగోలుతో అనుబంధం కలిగిన తల్లావఝుల పతంజలి శాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై జిల్లాకు చెందిన సాహిత్యకారులు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని 24 భారతీయ భాషల్లోని రచనలకు పురస్కారాలు ప్రకటించగా తెలుగు కథకు గాను పతంజలి శాస్త్రి రాసిన రామేశ్వరం కాకులు కథ ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి జాతీయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు, కృష్ణదేవరాయ సాహిత్య సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, పలు సామితీ సంస్థల ప్రతినిధులు, సాహితీవేత్తలు సింహాద్రి జ్యోతిర్మయి, మారేపల్లి సూర్యకుమారి, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, యూవీ రత్నం, డాక్టర్ మున్నంగి రాజకుమారి, కత్తి కృపావరం, మిడసల మల్లికార్జునరావు, కె.బాలకోటయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

ఉపాస్‌లో నాణ్యమైన వైద్య సేవలు



ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు టౌన్: తక్కువ ఖర్చుతో గుండె జబ్బులకు వైద్యాన్ని అందించే లక్ష్యంతో ఉపాస్ ప్రత్యేకంగా హార్ట్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. సంతపేటలోని పాత రాజమ్మ హాస్పిటల్ కాంపౌండులో ఆదివారం ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ఉపాస్ డైరెక్టర్లు ఉమాపతి చౌదరి, ప్రకాష్ చావల, కాప అనీల్‌కుమార్, అనపర్తి శ్రీనివాసరావులను అభినందించారు. తాజాగా ఒంగోలులో కాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గుండె జబ్బులకు అత్యవసర వైద్య సేవలను అందించడమే కాకుండా అతి తక్కువ ఖర్చుతో యాంజియోగ్రామ్ అందించాలని నిర్ణయించడం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఉపాస్ హార్ట్‌కేర్ సెంటర్‌లో కేవలం రూ.8 వేలకే యాంజియోగ్రాం చేయనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్లు తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చివుకుల శ్రీధర్ ఆధ్వర్యంలో అత్యాధునికమైన క్యాథ్‌ల్యాబ్, యాంజియోగ్రామ్, స్టంట్ ప్రొసిజర్లను జిల్లా ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ కె. సెల్వరాజ్, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, అమృత వైద్యశాల అధినేత డాక్టర్ వి.కేశవ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాస్ వైద్యుల బృందం డాక్టర్ కాకాణి పవన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్ గోనుగుంట్ల, డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ సువర్ణరాజు, డాక్టర్ యు శ్రీనివాసరావులను అభినందించారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ప్రారంభం



పరుగుపందెం పోటీలు



పాల్గొన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు

ఉలవపాడు: రాష్ట్రస్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు రామాయపట్నం చర్చి గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. షాట్‌పుట్‌లో 45 ఏండ్ల విభాగంలో మొదటి బహుమతి జీవన్‌కుమార్ (ప్రకాశం), రెండోస్థానం మురళి (ప్రకాశం), మూడో బహుమతి ఆర్‌వీఎన్ రాజు(విశాఖపట్నం), మహిళల విభాగంలో వింధ్య (కృష్ణాజిల్లా) మొదటిస్థానం సాధించింది. 85 ఏళ్ల లాంగ్‌జంప్‌లో వై రామచంద్రయ్య (నెల్లూరు) ప్రథమస్థానం సాధించారు. లాంగ్‌జంప్ 45 ఏళ్ల భాగంలో ఎస్ రమాదేవి (నెల్లూరు) ప్రథమస్థానం సాధించింది. ముందుగా జాతీయజెండాను ఆవిష్కరించారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌కుమార్, కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, వరప్రసాద్



షాట్‌పుట్‌లో బహుమతులు సాధించిన ప్రకాశం క్రీడాకారులు



మహిళల లాంగ్‌జంప్‌లో పతకం సాధించిన కృష్ణాజిల్లా క్రీడాకారిణి

సాంస్కృతిక వారసత్వమే సమాజ ప్రగతికి మూలం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ. పక్కన వీరారెడ్డి

మార్కాపురం: చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదే సమాజ ప్రగతికి మూలమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్, విద్యావేత్త డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి రచించిన మన ఊర్ల కథలు పుస్తకాన్ని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, కొత్త తరాలకు చారిత్రక విషయాలపై అవగాహన అవసరమన్నారు. మార్కాపురం ప్రాంతంలో కవులకు, కళాకారులకు ఆదరణ బాగుందని, వారిని ప్రోత్సహించాలని కోరారు. పశ్చిమ ప్రకాశంలోని చారిత్రక, సాంస్కృతిక వైభవం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో డాక్టర్ వీరారెడ్డి పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. ముద్రణకు సహకరించిన ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావును ప్రశంసించారు. కార్యక్రమంలో సాధనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూధన్, ఈఓ శ్రీనివాస రెడ్డి, కవులు ఎంపీ సుబ్బారావు, రాయప్రోలు వెంకటేశ్వర్లు, రాజేశ్వరరెడ్డి, టీడీ వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎం శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండి సంతోషంగా జీవిద్దాం

● రవాణాశాఖ ఉప కమిషనర్ సుశీల

ఒంగోలు: పండుగల నేపథ్యంలో ప్రజలు ఎక్కువగా రోడ్ల పైకి వస్తుంటారని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల విజ్ఞప్తిచేశారు. డిసెంబర్ 31 సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని ఎక్కువగా గమనిస్తుంటామని, అటువంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రమాదం జరిగిన కుటుంబాలు ఎంతో విలవిలలాడుతుంటాయని, చూసి జాలిపడడం కంటే అటువంటి పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండుగల వేళ ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత వాతావరణం వైపు పయనించేందుకు కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి క్రీడా పండుగ

● జిల్లాలో ఇప్పటికే 1.86 లక్షల మంది రిజిస్ట్రేషన్
● జిల్లా కేంద్రంలో కిలోమీటరు పొడవు ఉన్న జాతీయ పతాకంతో మారథాన్



ఒంగోలు: జిల్లాలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు గాను మొత్తం 47 రోజుల షెడ్యూల్‌ను కలెక్టర్ రూపొందించారు. గ్రామ/వార్డు స్థాయిలో ఈ నెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు, నియోజకవర్గ స్థాయిలో జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాస్థాయిలో 1.86 లక్షల మంది రిజిస్ట్రేషన్:

జిల్లాలో క్రీడాభిమానులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలోని 717 సచివాలయాల పరిధిలో 1,63,476 మందిని రిజిస్ట్రేషన్ చేయించాలని భావించారు. కానీ అనూహ్యంగా ఈ సంఖ్య 1,86,798కి చేరుకుంది. వీరిలో 1,14,289 మంది పురుషులు, 72,509 మంది మహిళలు ఉన్నారు.

26 నుంచి ఆటల పోటీలు

జిల్లా కేంద్రంతో పాటు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో కూడా మారథాన్ నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో క్రీడలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కిలోమీటరు పొడవైన జాతీయ జెండాతో, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో 500 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో, నియోజకవర్గ కేంద్రాలలో 200 నుంచి 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో పోటీలను ప్రారంభించాలని నిర్ణయించారు. మొత్తం 375 క్రికెట్ టీంలు, 182 ఇతర ఆటలకు సంబంధించిన క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

నిర్వహణ ఇలా:

పోటీల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 557 ఆటల స్థలాలను గుర్తించి వాటిని చదునుచేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే జిల్లాలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్లు/ వ్యాయామ ఉపాధ్యాయులు 400 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ప్రతి సచివాలయం పరిధిలో 10 మంది క్రీడా వలంటీర్లను గుర్తించి వారికి మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరిలో ఇద్దరిని మాత్రం కేవలం క్రిక్ క్లబ్ యాప్ అనే దానిలో క్రికెట్ స్కోరు నమోదుచేసేలా శిక్షణ ఇచ్చారు. వీరందరినీ పీడీ/ పీఈటీలు మానిటర్ చేసుకుంటూ ఆటల పోటీలు నిర్వహించనున్నారు.

పోటీల నిర్వహణకు ప్రత్యేక జాగ్రత్తలు: గుంటి రాజరాజేశ్వరి, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి

పోటీల నిర్వహణపై ఇప్పటికే పలుమార్లు చర్చించి ప్రత్యేక జాగ్రత్తలను అధికారులు తీసుకునేలా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ పోటీలు మొదటిసారి నిర్వహిస్తుండటంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని సచివాలయాలకు, మండల స్థాయిలో పోటీలు నిర్వహించే వారికి ఇచ్చే యూనిఫా, బేసిక్ కిట్లు, ప్రొఫెషనల్ కిట్లను కూడా ఇప్పటికే సంబంధిత ప్రాంతాలకు పంపించాం. ప్రతి మెటీరియల్ కూడా బ్రాండింగ్‌దే ఎంపిక చేయడం క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరం.

ఏసుక్రీస్తు స్ఫూర్తితో ముందడుగు వేద్దాం

● క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు టౌన్: యావత్ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిన ప్రభువు ఏసు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నగరంలోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన క్యాండిల్ సర్వీస్‌లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూట భావితరాలకు ఏసు ప్రభువు త్యాగాన్ని, ప్రేమను, దయను తెలియజేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రపంచంలోని మొత్తం దేశాలు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకుంటున్నారని చెప్పారు. యావత్ ప్రపంచంలో జరుపుకునే పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. గత 25 ఏళ్లుగా తాను ఎక్కడ ఉన్నా సరే ఒంగోలుకు వచ్చి క్రిస్మస్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఎన్ని పనులు ఉన్నా తనకు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ముఖ్యంగా భావిస్తానన్నారు. మాగుంట కుటుంబం సైతం క్రిస్మస్ పండుగను జరుపుకుంటుందని తెలిపారు. ఏసు ప్రభువు మానవాళికి లభించిన వరమని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు కరుణామయుడు ఏసు క్రీస్తు ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి చెప్పారు. ప్రతి ఒక్కరి కుటుంబంలో సంతోషాలు నిండాలని, ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. వేలాది మంది క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్నారు. చిన్నారులు, పెద్దలు, మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చిన్నారులు క్యాండిల్ వెలిగించి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆషిర్ పాల్ ప్రభువు సందేశాన్ని వినిపించారు. చర్చి కమిటీ కార్యదర్శి వై. స్వరూప్ ప్రార్థనలను పర్యవేక్షించారు. చర్చి కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

పొదిలి: ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం బుచ్చనపాలెం కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే..కాలనీకి చెందిన మల్లెల మార్తమ్మ(45) అనే మహిళ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సమస్యలే కారణమని బంధువులు తెలిపారు. సంఘటనపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.